
సాక్షి ఒడిశా

శుక్రవారం । 5 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,27,819లు, బంగారం 11గ్రాము 650 మిల్లీగ్రాములు, వెండి 97 గ్రాములు 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గణతంత్ర వేడుకలకు రాష్ట్ర శకటం ఎంపిక

ఈ ఏడాది జాతీయ స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రదర్శనకు రాష్ట్ర శకటం ఎంపికైంది.

- 8లో



ఉత్సాహంగా క్రీడాపోటీలు

యువ ఒడిశా.. నవీన్ ఒడిశా కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో పర్లాకిమిడి గజపతి స్టేడియంలో క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

ఉచితంగా నీట్, జేఈఈ కోచింగ్

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత మాధ్యమిక పాఠశాలల్లోని ప్లస్ టూ విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ నీట్, జేఈఈ కోచింగ్ ప్రారంభించింది. దీని కోసం స్మార్ట్ టీవీ, ఇంటరాక్టివ్ ప్యానెల్‌లను ఇన్‌స్టాల్ చేయాలని ఉన్నత మాధ్యమిక పాఠశాలలకు సూచనలు జారీ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ మరియు ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత మాధ్యమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరికీ ఉన్నత మాధ్యమిక విద్యా డైరెక్టర్ లేఖ జారీ చేశారు. పోటీ సామర్థ్యాన్ని పెంపొందించడానికి విద్యార్థులకు ఆన్‌లైన్ కోచింగ్ ఉచితంగా అందజేస్తారు. నీట్, జేఈఈలో రాష్ట్ర విద్యార్థుల ఉత్తీర్ణత రేటును మెరుగుపరచడం ఈ చర్య లక్ష్యంగా పేర్కొన్నారు. చర్చా విధానం పూర్తిగా విజువల్‌గా ఉన్నప్పటికీ, విద్యార్థులకు సాయం చేయడానికి మెంటర్ ట్యూటర్‌లను నియమించాలని ప్రిన్సిపాల్‌లను కోరారు. కోచింగ్ క్లాస్‌లో విద్యార్థుల హాజరు వివరాలను ఉన్నత మాధ్యమిక విద్య డైరెక్టరేట్ తెలియజేయాలని నోడల్ అధికారిని కోరారు.

మెడికల్ కాలేజీలో ఎలుకల సంచారం



వార్డులో సంచరిస్తున్న ఎలుకలు

కొరాపుట్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలలో ఎలుకల సంచారం విమర్శలకు తావిచ్చింది. రోగుల వార్డులో ఎలుకలు సంచరిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అవి రోగుల మీదుగా వెళ్తుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా వైద్య కళాశాలలో సిబ్బంది తీరుపై ఇటీవల తరచూ వివాదాలు వస్తున్నాయి. దీంతో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యాటకుల సందర్శన నిలిపివేత

భువనేశ్వర్: కేంద్రాపడా జిల్లా భిత్తరకనికా జాతీయ పార్కు సందర్శన తాత్కాలికంగా నిలిపివేయబడింది. ఉప్పునీటి మొసళ్లు, పక్షుల వార్షిక గణనను దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు నిర్ణయించారు. ఈనెల 5 నుంచి 13 వరకు సందర్శకుల పర్యటన నిలిపివేత కొనసాగనుంది. శిక్షణ పొందిన స్థానిక అటవీ సిబ్బంది, సరీసృప నిపుణుల సాయంతో లెక్కింపు బృందం మొసళ్ల లెక్కింపులో పాలుపంచుకుంటుంది. భిత్తరకనికా జాతీయ పార్కులో ప్రవహిస్తున్న అసంఖ్యాకమైన వాగులు, కాలువలు వంటి జలాశయాల్లో మొసళ్ల సంతతిని లెక్కిస్తారు. మహాకలపడా, రాజ్‌నగర్, గహిరమట్, కణియా ప్రాంతాలలోని నది పాయలు, వాగులు, కాలువల్లో క్రీక్స్‌తో సహా ఐదు రేంజ్‌లలో లెక్కింపు జరగనుంది. ఈ ప్రక్రియలో మొత్తం 22 బృందాలు పాల్గొంటాయి. జనవరి 9న సరీసృపాల గణన విధానంపై సిబ్బందికి శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈనెల 10 నుంచి మూడు రోజుల పాటు లెక్కింపు నిరవధికంగా కొనసాగుతుంది. భిత్తరకనికా జాతీయ పార్క్‌లో అన్ని మొసళ్లను లెక్కించేందుకు కృషి చేస్తామని రాజ్‌నగర్ డీఎఫ్‌వో సుదర్శన్ గోపీనాథ్ యాదవ్ తెలిపారు.

మూలనపడిన మాస్టర్ ప్లాన్..?

- నత్తనడకన చిలికా అభివృద్ధి
- ఏడాది అవుతున్నా అమలుకాని మంత్రి ప్రకటన
- ఎదురుచూస్తున్న పర్యాటకులు



నల్లబన ద్వీపంలో విదేశీ పక్షుల సందడి



చిలికా సరస్సులో పర్యాటకుల సందడి

బరంపురం: ఆసియాలోనే అతిపెద్ద సరస్సు చిలికా అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ఎప్పుడు అమలు చేస్తారోనని పర్యాటకులు, సందర్శకులు ఎదురుచూస్తున్నారు. ఏడాది క్రితం గంజాం జిల్లాకేంద్రం ఛత్రపూర్‌లో కలెక్టర్ కాన్ఫరెన్స్ రివ్యూ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి అశోక్ కుమార్ పండా మీడియాతో మాట్లాడుతూ.. చిలికా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. సరస్సును అంతర్జాతీయ పర్యాటక స్థలంగా రూపొందించేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని వెల్లడించారు. ఈకో టూరిజం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ అభివృద్ధి పథకం చేపట్టనుందన్నారు. దీనికోసం చిలికా ఏవిధంగా అభివృద్ధి చేపట్టాలో కోరుతూ ఢిల్లీకి చెందిన ఐటీఏ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకి టెండర్ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో అప్పటిలో మంత్రి అశోక్ కుమార్ పండా, పర్యాటక కమిషనర్ సత్యవ్రత బోయి, గంజాం కలెక్టర్లు చిలికా సరస్సుకి చేరుకొని మాస్టర్ ప్లాన్‌పై పరిశోధన జరిపి గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చారు. అయితే మంత్రి ప్రకటించిన చిలికా పర్యాటక అభివృద్ధి మాస్టర్ ప్లాన్ ఏడాది కావస్తున్నా.. ఇంతవరకు అమలు కాకపోవడంతో సందర్శకులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

ప్లాన్ అమలు జరిగితే...

చిలికా సరస్సు అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలు జరిగితే పర్యాటకుల సౌకర్యం కోసం సరస్సు మరింత సుందరంగా రూపుదిద్దుకోనుంది. 24 ద్వీపాల్లో కాటేజీలు, హోటళ్లు ఆధునిక సౌకర్యాలతో పర్యాటకులను ఆకట్టుకుంటాయి. పర్యాటకులు రాత్రి బస చేసేందుకు సౌకర్యాలు సైతం ఏర్పాటవుతాయి. అయితే ప్రతీ ఏడాది చలికాలంలో విదేశీ అతిథి పక్షులు విడిది ఏర్పర్చుకుంటున్న నలబన దీవిలో పక్షులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోనున్నారు. అలాగే మత్స్యకారులకు సైతం ప్రత్యేక ప్యాకేజీ అందనుంది. చిలికా అభివృద్ధికి కోసం అయ్యే ఖర్చు ప్రపంచ బ్యాంక్ అందిస్తుందని, అలాగే కేంద్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఆధ్వర్యంలో చిలికా అభివృద్ధి జరుగుతుందని అప్పట్లో జిల్లా కలెక్టర్ విజయ్ అమృత కులంగా తెలియజేశారు.

కేరళ తరహా అభివృద్ధి

మాస్టర్ ప్లాన్ అమలు జరిగితే 125 కిలోమీటర్ల విస్తీర్ణంలోని చిలికా సరస్సులో కొత్త అందాలు సంతరించుకోనున్నాయి. పర్యాటకులను ఆకట్టుకునేందుకు కేరళ తరహా హౌస్ బోట్ల సౌకర్యాలు, మోటార్ బోట్లుపై నీటి మధ్య ఉన్న మత్స్యకార దీవుల సందర్శనకు అవకాశం ఉంటుంది. చిలికా మత్స్యకారులకు చేపల సాగు చేసేందుకు చిలికా తీరాల్లో చెరువులు ఏర్పాటు జరగనున్నాయి. చేపల సాగు కోసం మత్స్యకారుల సౌకర్యార్థం కో–ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసి రుణాలు రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. ఒడిశా పర్యాటక మ్యాప్‌లో నేషనల్ జియోగ్రాఫి స్థానం పొందిన తర్వాత చిలికా అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టనునట్లు తెలుస్తోంది.



కేరళ తరహాలో ఏర్పాటు కానున్న హౌస్ బోటు



చిలికా సరస్సులో ప్రయాణిస్తున్న పర్యాటకులు



మాస్టర్ ప్లాన్ కోసం పరిశీలిస్తున్న మంత్రి అశోక్ పండా తదితరులు(ఫైల్)



పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన అతిథి గృహాలు

ప్రాకార ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సన్నాహాలు



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- సమీక్ష సమావేశం నిర్వహణ
- 12న యజ్ఞయాగాదుల ప్రక్రియ

భువనేశ్వర్: శ్రీ మందిర్ ప్రాకార ప్రాజెక్టు లోకార్పణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు భారీ సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా పూరీ గజపతి మహారాజా దివ్య సింఘ్ దేవ్ అధ్యక్షతన సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి(సీఏవో), జిల్లా కలెక్టర్, శ్రీ మందిరం పాలక మండలి సభ్యులు, జిల్లా, శ్రీమందిరం అధికార వర్గాలు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా ప్రముఖ దేవస్థానాలు, జ్యోతిర్లింగ క్షేత్రాలు ఇతరేతర ప్రముఖ ఆధ్యాత్మిక, ధార్మిక పీఠాల ప్రముఖులను ఈ మహోత్సవానికి సాదరపూర్వకంగా ఆహ్వానిస్తున్నారు. ఈ ప్రక్రియ త్వరలో పూర్తవుతుంది. ఈనెల 12వ తేదీ నుంచి యజ్ఞ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా పూరీ గజపతి మహారాజా దివ్య సింఘ్‌దేవ్ చేతులమీదుగా సంకల్పవక్కని తీసుకుని వెళ్లి యజ్ఞ ప్రక్రియకు శ్రీకారం చుడతారు. శ్రీ మందిరం రాజ పురోహితుల సంప్రదింపుల మేరకు గజపతి మహారాజా రాశి, నక్షత్రం ఆధారంగా యజ్ఞయాగాదుల ప్రారంభానికి ముహూర్తం ఖరారు చేసినట్లు ప్రకటించారు. ఈనెల 15వ తేదీ ఉదయం 7 గంటలకు శ్రీ మందిరం ఈశాన్య దిశలో అంకురార్పణ కార్యక్రమంతో మహోత్సవ వేడుకలు ప్రారంభిస్తారు. 17వ తేదీన జరిగే పూర్ణాహుతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రత్యక్షంగా హాజరవుతారు. ఇది 3 రోజుల పాటు సాగే గొప్ప సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమం. 17న దేశంలోని 60 ప్రధాన ఆలయాల నుంచి కార్యకర్తలు విచ్చేయనున్నారు. అతిథి సత్కారాలు, సౌకర్యాల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డెస్కులు ఉంటాయి. అదనపు జిల్లా కలెక్టర్ (జనరల్) ఈ ఏర్పాట్లు పర్యవేక్షిస్తారు. సేవాయత్ బృందంతో వెళ్లిన సీనియర్ ఓఏఎస్ రిసెప్షన్ ఇన్‌చార్జిగా ఉంటారని చీఫ్ అడ్మినిస్ట్రేటర్, జిల్లా కలెక్టర్‌కు తెలియజేశారు.


తీరానికి కొట్టుకొచ్చిన తాబేలు కళేబరం




తాబేలు కళేబరం

బరంపురం: గంజాం జిల్లా రుశికుల్యా నది ముఖద్వారానికి సంతానోత్పత్తి కోసం వస్తున్న తాబేళ్లు కొన్నిసార్లు మృత్యువాత పడుతున్నాయి. గురువారం గోపాల్‌పూర్ తీరానికి ఒక తాబేలు కళేబరం కొట్టుకురావడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తాబేళ్లకు రక్షణ కరువవుతోందని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

యువకుడి మొండెం లభ్యం



మృతదేహం కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు



బజా యోహు మొండెం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు పోలీసుస్టేషన్ పరిధి ఎంపీవీ 126 గ్రామ అడవిలో గురువారం యువకుడి మొండెం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జనవరి 1వ తేదీన లగుర్‌కొండ గ్రామానికి చెందిన కన్న యోహు కుమారుడు బజా యోహు స్నేహితులతో కలిసి వన భోజనానికి వెళ్లాడు. అయితే సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్నేహితులను అడిగారు. అయితే అతను ఇంటికి వెళ్లిపోయాడని వారు చెప్పడంతో పరిసర గ్రామాల్లో వెతికారు. కానీ ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో అతడి తండ్రి 2వ తేదీన మోటు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాధు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోద్ చేసి దర్యాప్తు చేపట్టారు. కానీ గురువారం అడవికి వెళ్లిన ఆవుల కాపరులకు రాళ్ల మధ్యన యువకుడి మొండం కనిపించడంతో గ్రామంలో తెలియజేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ మృతదేహం బజా యోహుదిగా గుర్తించారు. ఎవరో హత్యచేసి అక్కడ పడివేసినట్లు అనుమానిస్తున్నారు. కేసులో పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మృతదేహానికి కలిమెల ఆరోగ్య కేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు వెల్లడించారు.

135 కిలోల గంజాయి స్వాధీనం

బరంపురం:

దిగపండి నుంచి కారులో అక్రమంగా గంజాయితో బరంపురం నగరానికి రవాణా చేస్తున్న 135 కిలోల గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దిగపండి నుంచి బరంపురం వైపు వస్తున్న కారులో అక్రమంగా గంజాయి రవాణ అవుతున్నట్లు ఎక్సైజ్ అధికారులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో హింజికాట్–దిగపండి, బరంపురం మధ్య మూడు రోడ్ల జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా బరంపురం నగరంలోకి వస్తున్న కారులో తనిఖీలు నిర్వహించగా 5 బస్తాల్లో 135 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలాగే కారులో ఉన్నటువంటి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారు పశ్చిమ బెంగాల్‌లోని మిధనపూర్ జిల్లాకి చెందిన హరదన బెహరా, బిశ్వాజిత్ దాస్‌లుగా పేర్కొన్నారు. అరెస్టైన ఇద్దరినీ కోర్టుకి తరలించారు.



అరెస్టైన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

పర్యాటక రంగానికి పెద్దపీట



గొడగొడ జలపాతం

- రాయగడ జిల్లాకు రూ.3.44 కోట్ల నిధులు
- వివిధ ప్రాంతాల్లో అభివృద్ధికి ప్రణాళిక
- జిల్లా పర్యాటక శాఖ అధికారి భగవాన్ ఖొర



రాయగడ: రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా పర్యాటక శాఖ అధికారి భగవాన్ ఖొర అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. రాయగడ జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి రాష్ట్ర పర్యాటక శాఖ రూ.3.44 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. మంజూరైన నిధులతో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలియజేశారు. జిల్లా కేంద్రానికి సుమారు 6 కిలోమీటర్ల దూరంలోని వ్యూ పాయింట్ ప్రాంతానికి సందర్శకుల తాకిడి ఎక్కువవుతున్న నేపథ్యంలో రెండు శక్తి కేఫ్‌లను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. అందుకు సుమారు రూ.43 లక్షల నిధులను కేటాయించినట్లు వెల్లడించారు. అదేవిధంగా కాసీపూర్ సమితిలోని టికిరి పంచాయతీ దుర్గాపాడు ప్రాంతం పర్యాటకులకు కనువిందు చేస్తోంది. ప్రాకృతిక సౌందర్యంతో ఆలలాడుతున్న ఈ ప్రాంతంలోని జలపాతాలను సందర్శించేందుకు పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అక్కడికి రహదారి, తదితర అభివృద్ధి పనులకు రూ.61 లక్షల మంజూరయ్యాయని వివరించారు. అదేవిధంగా స్థానిక గుమ్మఘాట్ రోడ్డు నుంచి హలువ మీదుగా రాయగడకు వచ్చే రహదారిలో సుమారు రూ.1.48 కోట్లు వెచ్చించి వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రణాళికలు రుపొందించినట్లు వివరించారు. ఇందులో భాగంగా రహదారికి ఇరువైపులా విద్యుత్ దీపాలతో పాటు మధ్యలో బ్లాక్ టాయిలెట్స్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలియజేశారు.

శిల్బిగుడ డ్యామ్ సుందరీకరణ

సదరు సమితికి సమీపంలోని శిల్బిగుడ డ్యామ్ పరిసరాల్లో వివిధ అభివృద్ధి పనులు, డ్యామ్ సుందరీకరణ పనుల కోసం రూ.50 లక్షలు మంజూరైనట్లు తెలియజేశారు. ఈ డ్యామ్‌లో బోటింగ్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని, దీంతో పర్యాటకుల తాకిడి ఎక్కువవుతుందని చెప్పారు. అదేవిధంగా మరో రూ.80 లక్షల నిధులతో గొడగొడ జలపాతం వద్ద సౌందర్యీకరణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

శైవక్షేత్రం అభివృద్ధికి నిధులు

జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌లో ఉన్నటువంటి ప్రముఖ శైవక్షేత్రమైన దేవగిరి అభివృద్ధికి ప్రభుత్వం కొద్ది నెలల క్రితం రూ.43 లక్షల నిధులు మంజూరు చేసిందని, ఈ క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు మరిన్ని నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరడం జరిగిందని తెలియజేశారు. దేవగిరి కొండపై ఉన్న స్వయం జలపాతాలు, నీటి కుండీల సంరక్షణ కోసం మరింత నిధులు అవసరమున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఈ శైవక్షేత్రం అభివృద్ధి ఎంతో అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు.

చిలికాలో పక్షుల గణన ప్రారంభం

- లెక్కింపులో 21 బృందాలు



చిలికా సరస్సులో పక్షులను లెక్కిస్తున్న బృందం

భువనేశ్వర్: చిలికా సరసులో అతిథి (వలస) పక్షుల గణన గురువారం ప్రారంభమైంది. బలుగాంవ్ చిలికా వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపట్టారు. చిలికా అంతటా విస్తరించిన స్థానిక, దేశీయ, విదేశీ పక్షులను లెక్కిస్తారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పక్షుల గణన కార్యక్రమం ఖరారు చేశారు. దీని కోసం మొత్తం 21 బృందాలను నియమించారు. ఈ ఏడాది చలికాలంలో ఖుర్దా జిల్లా, గంజాం జిల్లా మరియు పూరీ జిల్లా పరిసర ప్రాంతాల చిలికా సరసుకు దేశ విదేశాల నుంచి వివిధ జాతుల పక్షులు విచ్చేశాయి. వీటిని లెక్కించి అధికారికంగా నమోదు చేస్తారు. పక్షుల లెక్కింపు కోసం బలుగాంవ్ చిలికా వన్యప్రాణి విభాగం పరిధిలో 5 రేంజ్‌లు (చిలికా, సత్పాడా, రంభ, సువాపడ, టంగి) నుంచి మొత్తం 21 బృందాలను నియమించారు. వీరిలో తీర ప్రాంతాల్లో (స్థల భాగం) 2 బృందాలు మరియు సరసు నీటి మార్గంలో 19 బృందాలు పాల్గొన్నాయి. ప్రతి జట్టులో 5 నుంచి 6 మంది ఎన్యుమరేటర్లని నియమించారు. ఈ నేపథ్యంలో ముందు రోజు బుధవారం పక్షుల గణన బృందానికి ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు.

సందర్శన నిలిపివేత

పక్షుల గణన సమయంలో చిలికాలో మత్స్యకారుల చేపల వేట, పర్యాటకుల సందర్శన నిలిపివేశారు. పక్షుల గణన తర్వాత ఈ–బర్డ్స్ యాప్ అనే సైట్‌లో పూర్తి వివరాలు పదిల పరుస్తారు. బైనాక్యులర్, బర్డ్స్ గైడ్ బుక్, కెమెరా, జీపీఎస్ ట్రాక్‌లను ఉపయోగించి పక్షుల నిపుణుల సాయంతో గణన చేపడుతున్నారు. ఈ లెక్కింపు పని కోసం 120 మందికి పైగా ఉద్యోగులు నిమగ్నమయ్యారు. వన్యప్రాణి విభాగం సిబ్బంది, బర్డ్ ప్రొటెక్షన్ ఫోర్స్, బర్డ్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ సిబ్బంది, ఓయూఏటీ, సిబ్బంది, విద్యార్థులు, సీడీఏ సిబ్బంది, పక్షి నిపుణులు, పర్యావరణవేత్తలు ఈ గణనలో పాల్గొంటున్నారు. చిలికాకు గతేడాది 105 జాతులకు చెందిన 10,93,049 విదేశీ పక్షులు, 79 జాతులకు చెందిన 38,880 దేశీయ పక్షులు వలస వచ్చాయి.

క్లుప్తంగా

కమల పూజారికి అస్వస్థత


చికిత్స పొందుతున్న పద్మశ్రీ కమల పూజారి

జయపురం: పద్మశ్రీ కమల పూజారి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని ప్రత్యేక క్యాబిన్‌లో వైద్య బృందం చికిత్స అందజేస్తున్నట్లు అధికారులు గురువారం తెలియజేశారు. ఆస్పత్రి ప్రధాన వైద్యుడు డాక్టర్ రబినారాయణ మిశ్ర నేతృత్వంలో కమలా పూజారికి వైద్య సేవలు అందించడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణ కుమార్ పాడి వెల్లడించారు.

నకిలీ మద్యం బాటిళ్లు స్వాధీనం


సీజ్ చేసిన నకిలీ మద్యం బాటిళ్లు చూపిస్తున్న అధికారులు

బరంపురం: గంజాం జిల్లాలో నకిలీ మద్యం మాఫియా విజృంభిస్తోంది. దీంతో వారి ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆశిష్ కుమార్ సింగ్ ఆదేశాలతో ఎక్సైజ్ అధికారులు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా దిగపండి పోలీసుస్టేషన్ పరిధి జినిగుడా గ్రామంలో ఉన్న ఒక ఇంటిలో తయారు చేస్తున్న నకిలీ మద్యం బాటిళ్లు, లేబుల్స్, వందలాది మూతలు సీజ్ చేశారు. అలాగే ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో జినిగుడా గ్రామానికి చెందిన మధన్ మాలిక్, బరంపురం లుచ్చాపడా గ్రామనికి చెందిన సునజా మాలిక్‌లు ఉన్నట్లు వెల్లడించారు.

బాబోయ్ భల్లూకం


రోడ్డుమీద సంచరిస్తున్న ఎలుగుబంటి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలోని కొసాగుమ్మ సమితి బొడ అంబడ గ్రామ సరిహద్దులలో భల్లూకం సంచరిస్తోంది. సమీప అటవీ ప్రాంతం నుంచి ప్రతిరోజూ ఆహారం కోసం గ్రామ సమీపంలోకి వస్తోంది. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే గ్రామస్తులు ఫిర్యాదు చేయకపోవడంతో అటవీ అధికారులు సైతం పట్టించుకోవడం లేదు.

గుడ్ల గోదాము తనిఖీ

కోటబొమ్మాళి: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు గుడ్లు సరఫరా చేస్తున్న గోదామును ఎంఈఓ–1 ఎస్.అప్పలరాజు గురువారం తనిఖీ చేశారు. కొన్ని పాఠశాలల్లో గుడ్లు ఉడకబెట్టే సమయంలో కరిగిపోతున్నాయని వంట ఏజెన్సీ మహిళలు ఎంఈఓకు ఫిర్యాదు చేయడంతో ఈ తనిఖీ చేపట్టారు. గుడ్లు నిల్వ చేసే షెడ్డులో గాలి, వెలుతురు సరిగా లేకపోవడంపై నిర్వాహకుడు శ్రీనివాస్‌ను ఎంఈఓ ప్రశ్నించారు. తక్షణమే శ్లాబు భవనంలోకి గుడ్లు మార్చాలని ఆదేశించారు. అంతకుముందు కోటబొమ్మాళి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన వంటకాలను ఎంఈఓ పరిశీలించారు. 520 గుడ్లలో 30 గుడ్లు కరిగిపోవడాన్ని గుర్తించారు. తరచూ ఇలా కరిగిపోతుండటంపై డీఈఓకు నివేదిక పంపిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

నాడు-నేడు సామగ్రి చోరీ

కాశీబుగ్గ: పలాస మండలం పండాశాశనాం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. ఇటీవల రూ.8లక్షలతో నిర్మించిన అధునాతన మరుగుదొడ్లలో ఉన్న ఖరీదైన ట్యాప్‌లు, పైపులు, ఇతర గృహోపకరణాలను దొంగిలించారు. ఉదయానికి ట్యాంక్‌లో నీరంతా ఆరుబయటకు రావడంతో గమనించిన గ్రామస్తులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుసక రామారావుకు సమాచారం అందజేశారు. పాఠశాల సమయానికి ముందే వచ్చిన ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రాజాం కూర్మారావుతో కలిసి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. గురువారం నాడు మధ్యాహ్న భోజన వంటకు, చిన్నారులు మరుగుదొడ్లకు అవసరమైన మంచినీరు అందుబాటులోకి రాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. పండాశాశనాం, హరిజనవీధి నుంచి మంచినీటిని తీసుకువచ్చి సర్దుబాటు చేశారు. కాశీబుగ్గ సీఐ నవీన్ కుమార్‌కు సమాచారం అందించారు.

ఆపదలో ఆదుకున్న యువకుడు

కాశీబుగ్గ: రెండు కిడ్నీలు పాడై తీవ్ర అనారోగ్యానికి గురైన వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు గ్రామానికి చెందిన సత్యనారాయణకు ఓ యువకుడు రక్తదానం చేసి ఆదుకున్నాడు. పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం, దయాల సిస్ కేంద్రంలో బాధితుడు చికిత్స పొందుతుండగా 'ఓ పాజిటివ్' గ్రూపు రక్తం గురువారం అత్యవసరమైంది. విషయం తెలుసుకున్న అక్కుపల్లికి చెందిన అంబటి రాజు రక్తదానానికి ముందుకొచ్చారు.

తులసీపాహడ్‌లో జన సంపర్క్ శిబిరం


శిబిరం వద్ద వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం


వృద్ధులకు రగ్గులు అందజేస్తున్న కమాండర్ సికిందర్ సింగ్


మహిళలకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి:

జిల్లాలోని మత్తిలి సమితి తులసిపాహడ్ గ్రామంలో బీఎస్ఎఫ్ 2వ బెటాలియన్ జవాన్లు జన సంపర్క్ శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. గతేడాది ఏప్రిల్ 23వ తేదీన రెండో బెటాలియాన్ తరుపున ఈ తులసీపాహడ్‌లో బీఎస్ఎఫ్ క్యాంప్ నిర్వహించారు. ఆ తర్వాత ఇక్కడ మావోల అలజడి తగ్గుముఖం పట్టింది. దీంతో మరోసారి ఇక్కడ జన సంపర్క్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బెటాలియాన్ కామాండర్ సికిందర్ సింగ్ మాట్లాడుతూ.. ఇక్కడ గిరిజన ప్రజలకు అండగా ఉంటామని తెలియజేశారు. అనంతరం ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళలకు చీరలు, వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు, చిన్నారులకు విద్యా సామగ్రి, యువతకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో మత్తిలి ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అమిత్, మహేంద్ర కుమార్ ప్రధాన్, ప్రభుదత్ విశ్వాల్, సమితా సాహు, టిమురపల్లి సర్పంచ్ తుమేశ్వర్ సమరథ్ తదితరులు పాల్గొన్నారు.


శిబిరానికి హాజరైన గిరిజనులు


మాట్లాడుతున్న బీఎస్ఎఫ్ అధికారులు

చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

- కొత్త హిట్ అండ్ రన్ చట్టంపై డ్రైవర్ల వ్యతిరేకత
- రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేస్తామని హెచ్చరిక

భువనేశ్వర్: భారతీయ న్యాయ సంహిత ఆధ్వర్యంలో ఇటీవల రూపొందించిన హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనల మధ్య ఒడిశా డ్రైవర్ల మహాసంఘ్ గురువారం నిరసన గళంతో విజృంభించింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త న్యాయ సంహిత చట్టం వెంటనే ఉపసంహరించుకోవాలని ఈ వర్గం డిమాండ్ చేసింది. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కొత్త చట్టంలో కఠినమైన నిబంధనకు వ్యతిరేకంగా పలు రాష్ట్రాల్లో ట్రక్కు ఆపరేటర్లు ప్రారంభించిన ఆందోళనకు ఒడిశా డ్రైవర్ల మహాసంఘ్ మద్దతు ప్రకటించింది. మహాసంఘ్ డ్రైవర్లు శుక్రవారం నుంచి స్టీరింగ్ బహిష్కరణ ఆందోళనలో పాలుపంచుకుంటున్నట్లు ప్రకటించింది. కొత్త భారతీయ న్యాయ సంహిత హిట్ అండ్ రన్ నిబంధనను నల్ల చట్టంగా వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డ్రైవర్లు ఈ చట్టాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు మహాసంఘ్ అధ్యక్షుడు ప్రశాంత్ మెండులి తెలిపారు. 27 ఇతర రాష్ట్రాలకు చెందిన సంఘాల కార్యవర్గ సభ్యులతో బుధవారం జరిగిన సమావేశంలో క్విట్ స్టీరింగ్ ఉద్యమాన్ని కొనసాగించాలని నిర్ణయించినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం బీమా కవరేజీ డిమాండుపై నాన్చుడు వైఖరి ప్రదర్శించడంపై తమ అసంతృప్తి కొనసాగుతుందని వెల్లడించారు.

శాంతియుతంగా ఆందోళన

ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా నిరసన ప్రదర్శిస్తారు. కేంద్ర ప్రభుత్వంతో జరిగిన చర్చల మేరకు అఖిల భారత రవాణా సంస్థల సంఘం ఆందోళనను విరమించినట్లు ప్రకటించినా రాష్ట్రంలో డ్రైవర్లు ఆందోళనను కొనసాగిస్తారని ప్రశాంత్ మెండులి తెలిపారు. కొత్త చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం హిట్ అండ్ రన్ కేసులకు భారతీయ న్యాయ సంహిత కింద 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.7 లక్షల జరిమానా విధించవచ్చు. ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లు, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయకుండా అక్కడి నుంచి పారిపోతే కఠిన శిక్షలు తప్పవని కొత్త చట్టం పేర్కొంది. గతంలో ఐపీసీ సెక్షన్ 304 కింద రెండేళ్ల జైలు శిక్ష విధించే నిబంధన మాత్రమే ఉండేది.

మహిళ మెడలో బంగారు ఆభరణం చోరీ

రణస్థలం: మండలంలోని పతివాడపాలెం గ్రామానికి చెందిన పతివాడ లక్ష్మి అనే మహిళ మెడలో బంగారు ఆభరణాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. జేఆర్ పురం పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మి పొలం పనులకు వెళ్లి వస్తుండగా మధ్యాహ్నం గ్రామంలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయానికి సమీపంలోని మట్టి రోడ్డులో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి మెడలో ఉన్న నగను లాక్కుని వెళ్లిపోయారు. ఆమె తేరుకునేలోపే వారు హైవేపైకి వెళ్లిపోయారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ తెలుగు మహాసభలకు కుప్పిలి, కర్నేనలకు ఆహ్వానం

ఆమదాలవలస: ఈ నెల 5, 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరగనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో పాల్గొని కవితా గానం చేసేందుకు ఆమదాలవలసకు చెందిన కవులు, రచయితలు కుప్పిలి వెంకటరాజారావు, కర్నేన జనార్దనరావులకు ఆహ్వానం వచ్చినట్లు వారు గురువారం తెలిపారు. గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యా సంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభల్లో ఇరువురు కవులు తమ కవితలను వినిపించనున్నామని తెలిపారు.

క్రికెట్ టోర్నీ పరిశీలకునిగా భాస్కర్

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల ఏడు నుంచి 15వ తేదీ వరకు తమిళనాడులోని చెన్నై హిందుస్థాన్ డీమ్డ్ యూనివర్సిటీలో సౌత్‌జోన్ అంతర విశ్వ విద్యాలయాల పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వ్యాయామ అధ్యాపకులు ఎ.భాస్కర్ పరిశీలకులుగా ఎంపికయ్యారు. ఈ ధ్రువీకరణ పత్రాలు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య అందజేశారు.

చెరువులో మునిగి మహిళ దుర్మరణం


మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి బొదాపుట్ గ్రామంలో ఒక మహిళ చెరువులో మునిగి దుర్మరణం చెందింది. మరణించిన మహిళ బొదాపుట్ గ్రామానికి చెందిన దొవున నాయిక్(55)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం సాయంత్రం దొవున నాయిక్ ఇంటి పనులన్నీ ముగించుకొని స్నానం చేసేందుకు గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లింది. అయితే ఆమె రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా జాడ తెలియలేదు. అయితే గురువారం ఉదయం చెరువు వద్దకు వెళ్లిన గ్రామస్తులకు ఆమె మృతదేహం తేలుతుండడం కనిపించింది. దీంతో వెంటనే వారు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. గ్రామస్తులు వెంటనే పోలీసులకు తెలియజేయగా పోలీసులు, అగ్నిమాపక విభాగాలకు చెందిన అధికారులు వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం పోస్టుమార్టం కోసం తరలించారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు


కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు తదితరులు


కబడ్డీలో తలపడుతున్న పురుషులు


బ్యాటింగ్ చేస్తున్న యువకుడు

యువ ఒడిశా.. నవీన్ ఒడిశా కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక గజపతి స్టేడియంలో క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. అలాగే శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాల మైదానంలో పురపాలక స్థాయిలో క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. వాలీబాల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ, పుట్‌బాల్, హాకీ పోటీలు నిర్వహించి విజేతలకు పురస్కారం అందిస్తామని క్రీడాధికారి కృష్ణ పాణిగ్రాహి తెలియజేశారు. కార్యక్రమంలో పురపాలక ఉపాధ్యక్షుడు లెంకమధు, కౌన్సిలర్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

– పర్లాకిమిడి


కబడ్డీలో తలపడుతున్న మహిళలు

గణతంత్ర వేడుకలకు రాష్ట్ర శకటం ఎంపిక


రఘురాజ్‌పూర్ హస్తకళ గ్రామం మహిళా సాధికారిత శకటం

భువనేశ్వర్: ఈ ఏడాది జాతీయ స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రదర్శనకు రాష్ట్ర శకటం ఎంపికైంది. 3 ఏళ్ల తర్వాత రాష్ట్రానికి ఈ అవకాశం వచ్చింది. పూరీ జిల్లాలో కళాకారుల గ్రామంగా పేరొందిన రఘురాజ్‌పూర్ గ్రామాన్ని వర్ణనతో మహిళా సాధికారిత ఇతివృత్తంతో శకటం రూపుదిద్దుకుంది. ఈ శకటం ప్రదర్శనకు ఎంపికైనట్లు కేంద్ర ప్రభుత్వం సమాచారం జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనాకు రక్షణ శాఖ లేఖ జారీ చేసింది. ఈ శకటం ప్రముఖ శిల్పి కీర్తి కిషోర్ మహరణ మరియు చిత్రకారుడు గజేంద్ర సాహు రూపొందించారు. రఘురాజ్‌పూర్ క్రాఫ్ట్ విలేజ్, మహిళా సాధికారత సందేశాలను ప్రదర్శిస్తూ సంబల్‌పురి సంగీతంతో ప్రదర్శన ప్రాంగణంలో ముందుకు సాగుతుందని వీరు వివరించారు. ఈ సంవత్సరం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం శకటాలు ఎంపిక చేశారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, జార్ఖండ్, లడఖ్ (కేంద్రపాలిత ప్రాంతం), మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి శకటాలు ఎంపిక చేసినట్లు సమాచారం.

ఈనెల 23న రిహార్సల్

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రదర్శనకు ఎంపికైన శకటాలు న్యూఢిల్లీలోని రాష్ట్రీయ రంగశాల శిబిరానికి తక్షణమే చేరాల్సి ఉంది. ఈ నెల 23న ఖరారు చేయబడిన గణతంత్ర దినోత్సవం కవాతు పూర్తి డ్రెస్ రిహార్సల్‌కు ముందే శకటాలు చేరదీసేందుకు నిర్ధారించారు. ఈనెల 19 నాటికి శకటాలను రిహార్సల్ ప్రదర్శనకు సిద్ధం చేయాలని తెలిపారు. ఏటా జరిగే గణతంత్ర వేడుకల కవాతు కార్యక్రమంలో శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ ప్రదర్శనలో దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాలకు చెందిన సాహితీ, సాంస్కృతిక, జానపద, సంగీతం, చిత్ర లేఖనం, లలిత కళలు, సంప్రదాయాలను శకటాలతో ప్రదర్శించడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

జాతీయ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు 'కూన'


కూన రామచంద్రను అభినందిస్తున్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు, పీడీలు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక జాతీయ సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన కూన రామచంద్రరా వు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ నుంచి వర్తమానం అందింది. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు తెలంగాణలోని జనగామ వేదికగా ఆలిండియా సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లాలోని ఎచ్చెర్ల మండల పరిధిలోని కేశవరావుపేట గ్రామానికి చెందిన కూన రామచంద్రరావు ఎంపికయ్యాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ఈ యువ క్రీడాకారుడు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ పోటీల కోసం ఈనెల 10న ఏపీ జట్టుతోపాటు పయనమవుతున్నాడు.

నేటి నుంచి జరిగే శిక్షణ శిబిరాలకు హాజరు..

జాతీయ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ముందు నేటి నుంచి మొదలయ్యే శిక్షణ శిబిరాలకు రామచంద్ర హాజరయ్యాడు. ఈ శిక్షణ శిబిరాలు అనంతపురంలోని ఆర్‌డీటీ క్రీడా ప్రాంగణం వేదికగా ఈనెల 5 నుంచి 10వ తేదీ వర కు 6 రోజుల పాటు ఈ శిబిరాలు జరగనున్నాయి. కేశవరావుపేటలోని నిరుపేద కుటుంబానికి రామచంద్ర తల్లిదండ్రులు కూన వెంకటరావు, కుమారిలు రోజువారీ కూలి పనిచేస్తుంటారు. రామచంద్ర బీఆర్ఏయూలో బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో స్థిరపడి తల్లిదండ్రులను బాగా చూసుకుంటానని, సాఫ్ట్‌బాల్ గేమ్‌ను అభివృద్ధి చేస్తానని రామచంద్ర చెబుతున్నాడు.

అభినందనల వెల్లువ..

రామచంద్ర నేషనల్ సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కలిదిండి నరసింహారాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్రా జట్టు ను విజయపథంలో నిలపాలని వారు ఆకాంక్షించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షులు ఎంవీ రమణ, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, ఉపాధ్యక్షు డు ఎం.తిరుపతిరావు, ఎం.ఆనంద్‌కిరణ్, జాయింట్ సెక్రటరీ అన్నెపు రాజగోపాల్, పి.రమేష్, జి.మల్లేష్, ఢిల్లీ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

6 నుంచి జాతీయ యువజన వారోత్సవాలు

శ్రీకాకుళం: ఈ నెల 18వ తేదీన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవరి 6వ తేదీ నుంచి జాతీయ యువజన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు శ్రీశారదారామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మందపల్లి రామకృష్ణారావు తెలిపారు. జనవరి 6వ తేదీన సరుబుజ్జిలి మండలంలో జాతీయ యువజన వారోత్సవాలు ప్రారంభిస్తామన్నారు. 12న శ్రీకాకుళంలో ముగిస్తామన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా జనవరి 6వ తేదీన విద్యార్థులకు వివేకానందుని సందేశం, 7న భారతీయ ఆదర్శాలు త్యాగం–సేవ, 8న యువతకు వివేకానందుని హితవు, 9న గ్రామ సేవయే రామ సేవ, 10న ధర్మ రక్షణ మోక్ష సాధన, 11న దేశ భద్రత సామాజిక బాధ్యత, జనవరి 12న స్వామి వివేకానంద జయంతి ఉత్సవం పేరిట ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో యువజన సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, యువకులు, విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

ఆటో నుంచి జారిపడి విద్యార్థికి గాయాలు


గాయాలతో బయటపడిన బాలుడు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఆటో నుంచి జారి పడి గాయపడ్డాడు. గురువారం ఉదయం పాఠశాలకు వెళ్తున్న ఆటో కాశీబుగ్గ బస్టాండ్ సమీపానికి వచ్చేసరికి అందులో నుంచి ఓ విద్యార్థి రోడ్డుపైకి తుళ్లిపడ్డాడు. గమనించిన తోటి విద్యార్థులు కేకలు వేసినా ఆటో డ్రైవర్ ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యాడు. వెనుక వస్తున్న వాహనదారులు గమనించడంతో ప్రమాదం తప్పింది. అనంతరం బాలుడికి సపర్యలు చేసి తల్లిదండ్రులకు అప్పగించారు.

వర్సిటీ క్రికెట్ జట్టు ఎంపిక


ఎంపికైన క్రికెట్ క్రీడాకారులతో వర్సిటీ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్ర చెన్నైలోని హిందుస్థాన్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సౌత్ జోన్ అంతర విశ్వ విద్యాలయాలు క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల క్రికెట్ జట్టును బుధ, గురువారాల్లో చిలకపాలేంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ క్రికెట్ మైదానంలో ఎంపిక చేశారు. ఈ ఎంపికలకు 28 కళాశాలల నుంచి 89 మంది రాగా, తుది జట్టు ప్రతిభ ఆధారంగా 15 మందిని ఎంపిక చేశారు. వీరు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. వర్సిటీకి మంచి పేరు తెచ్చేలా మెరుగైన ప్రదర్శన చేయాలని సూచించారు.

క్లుప్తంగా

అమృత రథ శోభాయాత్ర ప్రారంభం



రామనారాయణం ప్రాంగణం నుంచి యాత్రను ప్రారంభిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: శ్రీరామనారాయణం ఆధ్వర్యంలో శ్రీ హనుమాన్ సేవా ట్రస్టు సంకల్పంతో అమృత రథ శోభాయాత్ర శ్రీ రామ నారాయణం ప్రాంగణం నుంచి గురువారం ప్రారంభమైంది. జగద్గురు రామభద్రాచార్యులు నేతృత్వంలో రామనారాయణం వేద పాఠశాల విద్యార్థుల వేదమంత్రాల నడుమ అమృత రథ శోభాయాత్ర ప్రారంభం కాగా విజయనగరం పట్టణం పరిధిలోని వై జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఎన్‌సీఎస్ మల్టీప్లెక్స్, టీటీడీ కల్యాణ మంటపం, కోట కూడలి, దాసన్నపేట రైతు బజార్ మీదుగా యాత్ర శోభాయానంగా సాగింది. ఈ యాత్రలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి, భక్తులు, అధికసంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీల్లో గురుకుల విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

బొబ్బిలి: భువనేశ్వర్‌లో గత నెల 26 వరకూ జరిగిన జాతీయ వాలీబాల్ గేమ్స్ పోటీల్లో బొబ్బిలి రెసిడెన్షియల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థి కె.సందీప్ తృతీయ స్థానం సాధించాడు. రాష్ట్రజట్టులో ఇటీవలే చోటు సాధించి ప్రాతినిధ్యం వహించి బొబ్బిలి రెసిడెన్షియల్ స్కూల్‌కు పేరు తీసుకు వచ్చిన సందీప్‌ను, పీఈటీ ఎ. వెంకటరమణను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రఘునాథరావు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

ముగిసిన బాలోత్సవ్



పాటలు పాడుతున్న విద్యార్థులు

విజయనగరం టౌన్: స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో రెండురోజులుగా నిర్వహిస్తున్న బాలోత్సవ్ గురువారం ముగిసింది. విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం, స్పెల్‌బీ క్విజ్, జానపద నృత్యాల పోటీలు నిర్వహించారు. సుమారు 600 మంది విద్యార్థులు పోటీలకు హాజరు కాగా గెలిచిన అభ్యర్థులకు బహుమతులు అందజేశారు. నిర్వహణ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను, కళలను ప్రోత్సహించేందుకు కార్యక్రమాన్ని తొలిసారిగా విజయనగరంలో నిర్వహించామన్నారు. కార్యక్రమం విజయవంతానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సాహితీవేత్తలు, అభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిరాణా షాపులో 270 మద్యం బాటిల్స్ స్వాధీనం



మద్యం బాటిల్స్‌తో ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: మండలంలోని వివిధగ్రామాల్లో సిబ్బంది సహకారంతో సోదా చేసి లక్ష్మీపురంలోని కిరాణాషాపులో 270 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం రాజేష్ తెలియజేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఎక్కువ మద్యం సీసాలున్నా కేసులు నమోదు చేస్తామని, బెల్ట్‌షాపులు నిర్వహిస్తే శాఖాపరమైన ఇబ్బందులు తప్పవని, మద్యం సీసాలతో పట్టుబడిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఈ సందర్భంగా ఎస్సై తెలిపారు.

గిరిజన సంక్షేమ శాఖలో 251 పోస్టుల అప్‌గ్రేడ్

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో 251 పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ ఆ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతీలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తెలుగు 98, హిందీ 93, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు 60 పోస్టులను స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు అప్‌గ్రేడ్ చేస్తూ జీవో విడుదల చేశారు.

చీపురుపల్లిలో 100 పడకల ఆస్పత్రి

- ఏరియా ఆస్పత్రిగా సీహెచ్‌సీ అప్‌గ్రేడ్
- అదనంగా వైద్యులు, సిబ్బంది నియామకం
- నూతన భవనాలు, ఇతర మౌలిక వసతులు కల్పన



ఏరియా ఆస్పత్రిగా స్థాయి పెరగనున్న చీపురుపల్లి సీహెచ్‌సీ

చీపురుపల్లి: పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ స్పష్టమవుతోంది. ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల నుంచి సిబ్బంది వరకు, మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించిన ప్రభుత్వం అవసరమైన చోట ఆస్పత్రుల స్థాయిని పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే కొద్ది కాలం క్రితమే రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడిన చీపురుపల్లిలో ఉన్న ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) స్థాయి పెంచుతూ ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జీఓ విడుదల చేయడంతో ఇంతవరకు 50 పడకల ఆస్పత్రిగా ఉన్న చీపురుపల్లి సీహెచ్‌సీ 100 పడకల ఆస్పత్రిగా మారనుంది. దీంతో చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు ఇకపై ఉన్నత స్థాయి వైద్య సేవలు కోసం విజయనగరం, విశాఖపట్నం వెళ్లాల్సిన అవసరం ఉండదు. చీపురుపల్లి సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా స్థాయి పెంపొందించేందుకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఏరియా ఆస్పత్రిగా స్థాయి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతవరకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో పార్వతీపురంలో మాత్రమే ఏరియా ఆస్పత్రి ఉండేది. జిల్లా విభజన తరువాత విజయనగరం జిల్లాలో ఏరియా ఆస్పత్రి లేదు. తాజాగా చీపురుపల్లి సీహెచ్‌సీని వంద పడకల ఏరియా ఆస్పత్రిగా స్థాయిని పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.28.38 కోట్లతో భవనాలు, మౌలిక వసతులు

ఇదిలా ఉండగా చీపురుపల్లి సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా స్థాయిని పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసిన నేపథ్యంలో వంద పడకల ఏరియా ఆస్పత్రిలో అవసరమైన మౌలికవసతులు, భవనాలు, వైద్య సామగ్రి వంటి అవసరాల కోసం రూ.28.38 కోట్లు మంజూరు చేస్తున్నట్లు జీవోలో ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటికే దీనిపై క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం స్థానిక సీహెచ్‌సీలో 30 పడకల వరకు మాత్రమే వసతులు, భవనాలు, గదులు ఉన్నాయి. దీంతో తాజాగా వంద పడకల ఆస్పత్రి సౌకర్యాలకు సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో సమకూర్చనున్నారు.

24 మంది వైద్యులు..మరో 70 మంది సిబ్బంది..

చీపురుపల్లిలో ఏర్పాటుకానున్న ఏరియా ఆస్పత్రిలో అవసరమైన వైద్యులు, సిబ్బంది నియామకానికి సంబంధించి పోస్టులను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో భాగంగానే సివిల్ సర్జన్ (స్పెషలిస్ట్) 6 పోస్టులు, డిప్యూటీ సివిల్ సర్జన్(స్పెషలిస్ట్) 6 పోస్టులు, సివిల్ అసిస్టెంట్ సర్జన్(స్పెషలిస్ట్) 12 పోస్టులు కలిపి మొత్తం 24 మంది స్పెషలిస్ట్ వైద్యులు నియమితులు కానున్నారు. అంతే కాకుండా హెడ్‌నర్స్, స్టాఫ్‌నర్స్, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, సబార్డినేట్స్, కార్యాలయ సిబ్బంది అంతా కలిపి మరో 70 మంది వరకు నియామకం కానున్నారు.

ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు

ప్రస్తుతం 50 పడకలతో సీహెచ్‌సీగా ఉన్న ఆస్పత్రిని వంద పడకల ఏరియా ఆస్పత్రిగా స్థాయి పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇంతవరకు 50 పడకల ఆస్పత్రిగా ఉన్నప్పటికీ 30 పడకల వరకు మాత్రమే వైద్యసేవలు అందిస్తున్నాం. ఏరియా ఆస్పత్రిగా స్థాయిని పెంచడం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి.

– డా.నాయక్, సూపరెండెంట్, సీహెచ్‌సీ

జాతీయ బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు

- విజేతలను అభినందించిన డిప్యూటీ స్పీకర్



విజేతలను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జాతీయస్థాయిలో జరిగిన స్కూల్‌గేమ్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. గత నెల 24 నుంచి 29వ తేదీ వరకు మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరఫున పాల్గొన్న విజయనగరం క్రీడాకారులు టి.వసంత్, డి.దేవస్వరూప్‌లు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు గురువారం ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్ క్రీడాకారులు సాధించిన ఘనతను కోలగట్లకు వివరించగా.. ఆ ఇద్దరు క్రీడాకారులను కోలగట్ల అభినందించారు. భవిష్యత్‌లో మరింత ప్రతిభపాటవాలు పెంపొందించుకుని అంతర్జాతీయ స్థాయిలో జిల్లా ఖ్యాతిని చాటి చెప్పాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో శాప్ బాక్సింగ్ కోచ్ బి. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట మండల వాసికే టీడీపీ టికెట్ కేటాయించాలి

- నారా భువనేశ్వరికి వినతిపత్రం అందించిన పార్టీ శ్రేణులు



నారా భువనేశ్వరికి వినతిపత్రం అందిస్తున్న గిరిజన, టీడీపీ నాయకులు

సీతంపేట: పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ నిమ్మక జయకృష్ణపై ఆదే పార్టీకి చెందిన నాయకుల్లో ఉన్న అసంతృప్తి మరోమారు బహిర్గతమైంది. అవకాశం వచ్చిన ప్రతిసారీ తెలుగు తమ్ముళ్లు నియోజకవర్గంలో అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీ నాయకత్వం ఏకాభిప్రాయంతో లేదని స్పష్టం చేస్తున్నారు. ఇటీవల ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శనకు నియోజకవర్గంలో పర్యటించారు. ఆ సమయంలో ఓ వర్గం నాయకులు ఆ కార్యక్రమానికి స్థానిక మండలాల్లో దూరంగా ఉండి తమ వైఖరిని కుండబద్దలు గొట్టారు. తాజాగా భామిని మండలం బిల్లుమడలో మృతుని కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన నారా భువనేశ్వరిని సీతంపేట మండల గిరిజన నాయకులు గురువారం కలిసి తమ మనోగతాన్ని వివరించారు. నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే టికెట్‌ను ఈ దఫా సీతంపేట మండలానికి చెందిన గిరిజనులకు కేటాయించాలని కోరారు. ఈ మేరకు ఆమెకు వినతిపత్రం అందించారు.

140 మద్యం సీసాల పట్టివేత



పోలీసులు పట్టుకున్న మద్యం బాటిల్స్

రేగిడి: మండలంలోని కాగితాపల్లి గ్రామం సమీపంలో బుధవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న 140 మద్యం బాటిల్స్‌ను ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నట్లు ఎస్సై ఇ.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈ సీసాలతో పాటు టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనాన్ని పట్టుకున్నామని, వాటిని సీజ్ చేసి కోర్టుకు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. బాటిల్స్ తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదుచేశామన్నారు.



స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్సై నీలకంఠం,సిబ్బంది

వంద లీటర్ల సారా స్వాధీనం

కొమరాడ: మండలంలోని దేవుకోన జంక్షన్ వద్ద గురువారం నిర్వహించిన తనిఖీల్లో మోటార్ సైకిల్‌పై ఓ వ్యక్తి తరలిస్తున్న 100 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. ఈమేరకు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ప్రభుత్వ నియమాల ఉల్లంఘనపై చర్యలు

- డీఈఓ ఎన్.ప్రేమ్ కుమార్

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ నియమాలు ఉల్లంఘించి విధుల్లో అలసత్వం వహించిన పలువురు కేజీబీవీ సీఆర్‌టీలపై చర్యలు చేపట్టినట్లు పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 27, 28 తేదీల్లో కాంట్రాక్ట్ సీఆర్‌టీలు సమ్మెకు సంబంధించి 67మందికి షోకాజ్ నోటీసులు అందించామని తెలిపారు. వారు ఇచ్చిన వివరణ సరిగా లేకపోవడంతో 67మందిని టెర్మినేట్ చేసినట్లు చెప్పారు. సమ్మెలో పాల్గొన్న 179 సీఆర్‌టీ, ఎంఐఎస్, మెసెంజర్లకు షోకాజ్ నోటీసులు అందజేశామని తెలిపారు. వారు నిర్వహిస్తున్న సమ్మె విద్యార్థుల పరీక్షలపై ప్రభావం చూపుతోందని తెలిపారు.

డంపింగ్‌యార్డు తరలింపుపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే జోగారావు



డంపింగ్ యార్డు సమస్యను కలెక్టర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పురపాలకసంఘం పరిధిలో అతి ప్రధానమైన సమస్యలలో ఒకటైన డంపింగ్ యార్డు తరలింపుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కలెక్టరేట్‌లో కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం పట్టణ శివారులో గల డంపింగ్ యార్డు మూలంగా స్థానికంగా ఉన్న పలు వార్డుల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కారణంగా డంపింగ్ యార్డును తరలించాలని చెప్పారు. సమస్యను సాధ్యమైనంత వరకు పరిష్కరించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ అధికారులతో సమీక్షించి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ఆర్డీఓ హేమలత, ఏఓ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వార్డు కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల సీజ్

గజపతినగరం: మండలంలోని వేమలి గ్రామంలో కోడిపందాలపై దాడులు చేశామని ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర శుక్రవారం తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ దాడుల్లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.300, రెండు మోటార్ సైకిల్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

దివ్యాంగుల సేవలో తపిస్తున్న గురుదేవ

- కృత్రిమ అవయవాల తయారీ అద్భుతం
- డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్



డీఆర్‌ఎం దంపతులకు కృత్రిమ అవయవాల తయారీ విధానంపై వివరిస్తున్న ట్రస్టు చైర్మన్ జగదీష్‌కుమార్

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో గల గురుదేవా చారిటబుల్ ట్రస్టు దివ్యాంగుల సేవలో పరితపిస్తోందని విశాఖపట్నం డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ ప్రశంసించారు. ఈ మేరకు డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ దపంతులు గురువారం గురుదేవా చారిటబుల్ ట్రస్టును సందర్శించారు.ఈ సందర్భంగా దివ్యాంగులకు ట్రస్టు ద్వారా అందజేస్తున్న సూపర్‌స్పెషాల్టీ ఆస్పత్రి సేవలు, కృత్రిమ అవయవాల తయారీ, ఫిజియో థెరపీ తదితరాల గురించి ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌కుమార్ వారికి వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ దంపతులు మాట్లాడుతూ దేశంలోని కొద్దిమంది మాత్రమే దివ్యాంగులకు సేవలు అందిస్తున్నారని వారిలో గురుదేవా ట్రస్టు ఆధ్వర్యంలో జగదీష్‌కుమార్ సేవలు అమోఘంగా ఉన్నాయన్నారు. అనంతరం 50 మంది దివ్యాంగులకు వివిధ రకాల ఉపకరణాలు, కృత్రిమ అవయవాలను అందజేశారు. అలాగే 60 మంది వృద్ధులకు రేషన్, పింఛన్ సొమ్మును అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

మహాసామ్రాజ్య పట్టాభిషేకానికి రూ.2 లక్షల విరాళం



మహాసామ్రాజ్య పట్టాభిషేకానికి రూ.2 లక్షల విరాళాన్ని అందజేస్తున్న కనకల కృష్ణ

విజయనగరం: విజయనగరంలోని రింగ్‌రోడ్ శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 22 నుంచి జరగనున్న మహాసామ్రాజ్య పట్టాభిషేకానికి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కనకల కృష్ణ తన వంతు సహాయమందించారు. ఆలయానికి చెందిన శ్రీ శ్రీనివాస సేవా సంఘం ప్రతినిధి చెరుకూరి శ్రీధర్‌కు రూ.2 లక్షల నగదును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కనకల కృష్ణ మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి నిర్వహించే అతి పెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగస్వామ్యం లభించటం ఆనందంగా ఉందన్నారు. మహాసామ్రాజ్య పట్టాభిషేకానికి భద్రాచలం నుంచి అర్చక బృందం రానున్నట్టు పేర్కొన్నారు. తమ నాయకులు, శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి చూపిన సేవా మార్గంలో వెళ్తున్నానని, తన తల్లిదండ్రులు పేరిట అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నానని, ఆధ్యాత్మికత పెంపొందించేందుకు తన వంతు బాధ్యతగా సాయం చేసినట్టు తెలిపారు.

అంధులకు దైవస్వరూపుడు బ్రెయిలీ

- అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్



అంధ ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

విజయనగరం అర్బన్: విభిన్న ప్రతిభావంతులైన అంధులకు లూయీ బ్రెయిలీ దైవస్వరూపుడిగా నిలుస్తారని అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ అన్నారు. విభిన్నప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక మెసానిక్ టెంబుల్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన 'లూయీ బ్రెయిలీ' జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ బ్రెయిలీ లిపి లేకపోతే అంధులలోని ప్రతిభాపాటవాలు మరుగున పడేవని అందుకే అలాంటి వ్యక్తి వారికి దైవస్వరూపుడిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో భాగంగా విభిన్న ప్రతిభావంతులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇద్దరు ప్రతిభావంతులైన అంధ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ అందజేశారు. కార్యక్రమంలో బ్రెయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు జీవీబీజగదీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీకోసం సమష్టిగా పనిచేయాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా పనిచేస్తేనే సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీని సాధించగలమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన రాజాం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ నివాసం వద్ద పట్టణంలోని పార్టీ నేతలు, కార్యకర్తలతో మాట్లాడారు. తలే రాజేష్‌కు కార్యకర్తలను పరిచయ కార్యక్రమం నిర్వహించారు. రాజాంలో పార్టీ వ్యవహారాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్‌కు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ పుష్ప గుచ్ఛం అందించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వంజరాపు విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో దేవీశ్రీ ప్రతిభ



సాధించిన రజత పతకంతో క్రీడాకారిణి దేవీశ్రీ

నెల్లిమర్ల రూరల్: అరుణాచల్‌ప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో గత నెల 28 నుంచి జరుగుతున్న ఐడబ్ల్యూఎల్ఎఫ్ జాతీయ స్థాయి యూత్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ వెయిట్‌లిఫ్టింగ్ జిమ్‌కు చెందిన క్రీడాకారిణి జనపాటి దేవీశ్రీ గురువారం రజత పతకం సాధించింది. 71 కేజీల విభాగంలో పోటీలో పాల్గొన్న దేవీశ్రీ స్నాచ్‌లో 78 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 100 కిలోలు..మొత్తంగా 178 కిలోల బరువును ఎత్తి పతకం దక్కించుకుంది. ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణిని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు విద్యార్థులఎంపిక



జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: అండర్ 17 విభాగంలో జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు జిల్లా తరఫున గొట్లాం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు హెచ్.ఎం.బి.శ్రీరామాచారి తెలిపారు. గత నెల 30,31 తేదీల్లో ఒంగోలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొన్న విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రంలో రెండవస్థానంలో నిలిచి జాతీయ పోటీలుకు అర్హత సాధించినట్లు చెప్పారు. త్వరలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న పోటీల్లో బి.హరి, కె.రిషేంద్ర, ఎం.లిఖిత, సీహెచ్.రమాదేవిలు పాల్గొనున్నట్లు తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులను పీడీలు యు.సత్యానంద్, ఎల్.వి.రమణలు అభినందించారు.

జాతీయ సైక్లింగ్ పోటీలకు గణేష్ ఎంపిక



జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు వెళ్తున్న గణేష్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

విజయనగరం: జాతీయస్థాయిలో జరగబోయే సైక్లింగ్ పోటీలకు విజయనగరం జిల్లా గంట్యాడ మండలం ఆర్.వసంత గ్రామానికి చెందిన దమరసింగి గణేష్ ఎంపికయ్యాడు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గణేష్ ఈనెల 9 వ తేదీ నుంచి 12 తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని విజయపూర్‌లో జరగనున్న 28వ సీనియర్స్ జాతీయ సైక్లింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కించుకున్నాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైన గణేష్‌ను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు గురువారం అభినందించారు. జాతీయస్థాయి పోటీలకు హాజరయ్యేందుకు అవసరమైన ఖర్చుల నిమిత్తం నగదు సహాయాన్ని అందజేశారు.

వీడని వివాదం

- పాకలు తీసేది లేదని ఆక్రమణదారుల స్పష్టీకరణ



తహసీల్దార్ కార్యాలయంలో ఆక్రమణదారులతో చర్చలు జరుపుతున్న తహసీల్దార్, డిప్యూటీ కలెక్టర్ తదితరులు

శృంగవరపుకోట: పట్టణంలో చెరుకు కాటాను ఆనుకుని ఉన్న స్థలంలో అక్రమంగా పాకలు నిర్మించిన వివాదం సద్దుమణగలేదు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ సుదర్శన్‌దొర సమక్షంలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఆక్రమణదారులతో సమావేశమై ప్రభుత్వస్థలాన్ని కబ్జా చేసి పాకల నిర్మాణానికి పూనుకోవడం సరికాదని నచ్చచెప్పినా వారు అంగీకరించలేదు. సుమారు 20 మంది ఆక్రమణదారులు ఎస్.కోట చెరుకు కాటాస్థలం కబ్జా చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుపై తహసీల్దార్ శ్రీనివాసరావు వివాదస్థలానికి బుధవారం వెళ్లి, ఆక్రమణదారులకు నచ్చచెప్పి ఖాళీ చేయించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వారిని రప్పించి, చర్చలు జరిపారు. దరఖాస్తులు ఇస్తే పరిశీలించి ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేనివారికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని, ప్రభుత్వ స్థలం ఆక్రమించడం చట్టవిరుద్ధమని నచ్చజెప్పారు. ఎవరికి తోచినట్టు వారు ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే, తామంతా ఎందుకని, సమస్యను సానుకూలంగా పరిష్కారం చేసుకోవాలని, సదరు గెడ్డ స్థలాన్ని ఖాళీ చేయాలని కోరారు. ఇందుకు ఆక్రమణదారులు కాటా స్థలం హద్దులు తేల్చితే, స్థలం కాటాకు చెందినదైతే ఖాళీ చేస్తామని, ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకూ తాము అక్కడే పాకలు కట్టుకుని నివాసం ఉంటామని, తేల్చిచెప్పి వెళ్లిపోయారు.

ధాన్యం రవాణాలో లోపాలు ఉండకూడదు

- మిల్లులను పరిశీలించిన ఆర్‌డీఓ సాయిశ్రీ



గొల్లపల్లిలోని రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

బొబ్బిలి: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం రవాణాలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని ఆర్డీఓ ఎ.సాయిశ్రీ మిల్లర్లను ఆదేశించారు. పట్టణంలోని విజయగౌరి, మహాలక్ష్మి, విజయలక్ష్మి మోడరన్ రైస్‌మిల్లులను ఆమె ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లర్లకు ఎకనాలెడ్జ్‌మెంట్‌ల జారీ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్‌బీకేల నుంచి వచ్చిన ధాన్యం లోడ్లను వెంటనే అన్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం గొల్లపల్లిలోని ఆర్‌బీకేను సందర్శించారు. అక్కడ రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం వద్ద ఆగి సరఫరా ఎలా జరుగుతుందో ఆరా తీసి లబ్ధిదారులతో మాట్లాడారు. ఆమె వెంట పౌర సరఫరాల ఉప తహసీల్దార్ రెడ్డి సాయికృష్ణ తదితరులు ఉన్నారు.